క్లుప్తంగా

ఈ-క్రాప్‌తో మేలు



లావేరులో ఈ-క్రాప్ నమోదు చేస్తున్న అగ్రికల్చర్ అసిస్టెంట్ గిరిజ

లావేరు: రైతులు సాగు చేస్తున్న పంటల వివరాలు ఈ–క్రాప్‌లో నమోదు చేయించడం వల్ల ఎంతో మేలు జరుగుతుందని మండల వ్యవసాయాధికారి డి.మహేష్‌నాయుడు అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం రైతు భరోసా కేంద్రాల అగ్రికల్చర్ అసిస్టెంట్లు ఈ–క్రాప్ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని ఏఓ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ–క్రాప్ నమోదు ఆధారంగానే రైతులుకు పంటలు బీమా, పంటలు కొనుగోళ్లు, విత్తనాలు, ఎరువులు అందించడంతోపాటు పలు పథకాలు, కార్యక్రమాలు వర్తించడం జరుగుతుందన్నారు.

ఆక్రమణలు తొలగించాలి



చిన్నవాని గెడ్డ ఆక్రమణల వద్ద ఆందోళన చేస్తున్న సర్వేశ్వరపురం గ్రామస్తులు

జి.సిగడాం: మండలంలోని సర్వేశ్వరపురం గ్రామంలో గల వాగులు, గెడ్డల ఆక్రణలపై గ్రామస్తులు సోమవారం ఆందోళన వ్యక్తం చేశారు. విజయనగరం జిల్లా బొండపల్లి, జి.సిగడాం మండలం సర్వేశ్వరపురం సరిహద్దులో ఉన్న చిన్నవాని గెడ్డ ఆక్రమణకు గురైందన్నారు. గెడ్డను బొండపల్లి గ్రామానికి చెందిన కొంతమంది ఆక్రమించి స్తంభాలు కూడా వేశారని, దీంతో తమ పంట పొలాలకు సాగునీరు రావడం కష్టంగా మారిందని సర్వేశ్వరపురం గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆక్రమణలు తొలిగించి సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. లేనిపక్షంలో తామే స్తంభాలను తొలిగిస్తామన్నారు. ఇప్పటికే సంబంధిత ఉన్నతాధికారులకు కూడా వినతిపత్రాలను అందించామని తెలిపారు.

సత్యనారాయణకు దాసరి అవార్డు



సత్యనారాయణకు అవార్డు అందజేస్తున్న ప్రముఖులు

రణస్థలం: మండలంలోని రణస్థలం గ్రామానికి చెందిన బ్యాండ్ కళాకారుడు పరిమెళ్ల సత్యనారాయణకు దర్శకరత్న దాసరి ఆత్మీయ పురస్కారం వరించింది. విశాఖపట్నంలోని దాసరి అవార్డు ప్రధానోత్సవ కార్యక్రమం సోమవారం జరిగింది. విశాఖరత్నం కంచర్ల అచ్యుత్‌రావు, విశాఖ మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ, సినీ హీరో ఉపేంద్ర తదితరుల చేతుల మీదుగా సత్యనారాయణ పురస్కారం అందుకున్నారు. సత్యనారాయణకు రణస్థలానికి చెందిన తోటి కళాకారులు అభినందనలు తెలిపారు.

ఉమా జలలేశ్వరునికి పూజలు



ప్రత్యేక అలంకరణలో స్వామివారు

శ్రీకాకుళం కల్చరల్ : నగరంలోని నక్కవీధిలో ఉమాజలలేశ్వరస్వామి దేవాలయంలో సోమవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అర్చకులు అశ్వినీకుమార్, మహేష్‌ల ఆధ్వర్యంలో స్వామివారిని పుష్పాలు, పండ్లతో అలంకరించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి స్పందన



మందులు అందిస్తున్న అభిమానులు

శ్రీకాకుళం కల్చరల్: మెగాస్టార్ చిరంజీవి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని శ్రీకాకుళం జిల్లా చిరంజీవి యువత ఆధ్వర్యంలో సోమవారం మొండేటివీధిలో మెగా ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో అఖిల భారత చిరంజీవి యువత వర్కింగ్ ప్రెసిడెంట్ తైక్వాండో శ్రీను, సుధీర్ వర్మ, బలభద్రుని రాజా, షేక్ అబ్దుల్లా, బాలకృష్ణ, షిరిడీ సాయి సేవాసంఘం అధ్యక్ష, కార్యదర్శులు గిడుతూరి వెంకటేశ్వరరావు, కళ్లేపల్లి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పేదల కల నెరవేర్చాం



గడపగడప కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి ధర్మాన ప్రసాదరావు, కమిషనర్ ఓబులేషు తదితరులు

- శ్రీకాకుళం నగరాభివృద్ధికి కృషి చేశాం
- గడపగడపకు మన ప్రభుత్వంలో మంత్రి ధర్మాన ప్రసాదరావు

శ్రీకాకుళం రూరల్: పేదల కలలు నెరవేర్చడంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం విజయం సాధించిందని, ప్రతి ఒక్కరూ సంతోషంగా ఉండాలనే దృక్పథంతోనే ఈ ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్ స్టాంప్స్ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. శ్రీకాకుళం నగరంలోని హయాతినగరంలో సోమవారం గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నాలుగేళ్లలో ప్రభుత్వ చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన మాట ప్రకారం 90 శాతం హామీలను నెరవేర్చినట్లు తెలిపారు. 2019లో అన్ని వర్గాల ప్రజలు జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలిచారని, ఈరోజు పేదల జీవితాల్లో వెలుగులు చూశామని చెప్పారు. స్థానికుల కోరిక మేరకు శ్రీకాకుళం నాగావళి నదీతీరం వెంబడి రిటైనింగ్ వాల్ నిర్మాణం త్వరలో ప్రారంభిస్తామన్నారు. సామాజిక మరుగుదొడ్లు, సీసీరోడ్ల నిర్మాణం పూర్తి చేస్తామని చెప్పారు. నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో మిగిలిన పనులను డిసెంబర్ కల్లా పూర్తి చేస్తామన్నారు. ఇప్పటికే అర్బన్ ఆసుపత్రులను అన్ని హంగులతో అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. గతానికి ఇప్పటికీ వైద్య వ్యవస్థలో చాలా మార్పులు చేశామని గుర్తు చేశారు. రిమ్స్ ఆస్పత్రిలో 900 బెడ్స్‌ను అందుబాటులోకి తీసుకొచ్చామని, కార్పొరేట్ తరహాలో ప్రజలకు సేవలందిస్తున్నట్లు చెప్పారు. రూ.10 కోట్లతో పట్టణంలోని రహదారుల నిర్మాణం చేపట్టామని, ఇదంతా ప్రభుత్వ సమర్థత వల్లే జరిగిందన్నారు. గత ప్రభుత్వ హయాంలో జన్మభూమి కమిటీ సభ్యులు నిర్వాకం వల్ల దోపిడీలు జరిగాయని, దీంతో పథకాలు అర్హులకు వచ్చేవి కాదని గుర్తు చేశారు. ఇప్పుడా పరిస్థితి లేదన్నారు. నగర పాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేషు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర కళింగ కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు, మాజీ మున్సిపల్ చైర్మన్లు ఎం.వి.పద్మావతి, పైడిశెట్టి జయంతి, సాధు వైకుంఠరావు తదితరులు పాల్గొన్నారు.

ఆ స్థలం.. గ్రామకంఠం

- టీడీపీ నాయకుడికి ఎటువంటి సంబంధం లేదు
- జే.ఆర్.పురం సీఐ ఆదాం, ఎస్‌ఐ రాజేష్



జె.ఆర్.పురంలో వివాదం జరిగిన స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

రణస్థలం: మండల కేంద్రంలోని జే.ఆర్.పురం పంచాయతీలో గల తాత్కాలిక రావాడ ఆటో స్టాండ్ స్థలంపై టీడీపీ నాయకుడు డీజీఎం ఆనందరావుకు ఎటువంటి సంబంధం లేదని స్థానిక తహసీల్దార్ సనపల కిరణ్‌కుమార్ తెలియజేసినట్లు జే.ఆర్.పురం ఎస్‌ఐ జి.రాజేష్ తెలిపారు. సోమవారం జే.ఆర్.పురం పంచాయతీ వైఎస్సార్‌సీపీ నాయకుడు పిన్నింటి సత్యంనాయుడు, టీడీపీ నాయకుడు డీజీఎం ఆనందరావుకు గ్రామ కంఠంలో ఉన్న రావాడ తాత్కాలిక ఆటో స్టాండ్ స్థలంపై వివాదం నెలకొంది. జే.ఆర్.పురం సీఐ ఎస్ ఆదాం, ఎస్‌ఐ రాజేష్ సంఘటన స్థలాన్ని పరిశీలించి పరిస్థితిని అదుపుచేశారు. సీఐ, ఎస్‌ఐలు మాట్లాడుతూ వివాదంలో ఉన్న భూమిపై ప్రభుత్వానికి, పిన్నింటి సత్యంనాయుడు తల్లి నాగభూషణమ్మకు న్యాయం స్థానంలో కేసు నడుస్తోందన్నారు. ఈ స్థలంపై ఎటువంటి అభ్యంతరం పెట్టాలన్నా.. రెవెన్యూ అధికారులకే పెట్టాలని, టీడీపీ నాయకుడు ఆనందరావుకు ఎటువంటి సంబంధం లేదని స్పష్టంచేశారు. దీనిపై తహసీల్దార్ కిరణ్‌కుమార్‌కు వివరణ కోరగా.. ఆ స్థలం గ్రామ కంఠంలో ఉందన్నారు. దీనిపై పిన్నింటి నాగభూషణమ్మకు, ప్రభుత్వానికి కేసు నడుస్తోందని, టీడీపీ నాయకుడు ఆనందరావుకు ఎటువంటి సంబంధం లేదన్నారు. ఈ భూమి గ్రామకంఠం కావడంతో పంచాయతీకి పూర్తి హక్కులు ఉంటాయన్నారు. పిన్నింటి నాగభూషణమ్మకు టైటిల్ డీడ్ రావాలన్నా హైకోర్టు నుంచే తెచ్చుకోవాల్సి ఉంటుందన్నారు.

కాలనీవాసుల కోరిక మేరకే రోడ్డు నిర్మాణం



రోడ్డు నిర్మించాలని కోరుతున్న పీబీనగర్ కాలనీవాసులు

లావేరు: మురపాక పంచాయతీ పరిధిలోని పీబీనగర్‌కాలనీలో రోడ్డు సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నామని చెప్పడంతో కాలనీవాసుల కోరిక మేరకే రోడ్డు నిర్మాణం చేపడుతున్నామని, ఈ క్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఆలయ ప్రహరీని కూల్చి వేశారనడం సరికాదని మురపాక సచివాలయం కన్వీనర్ బాలి శ్రీనివాసనాయుడు, నాయకులు పెయ్యల లక్ష్మణరావు అన్నారు. పీబీ నగర్ కాలనీలో సోమవారం వారు విలేకరులతో మాట్లాడుతూ రెండు నెలల క్రితం పీబీ నగర్‌కాలనీ ప్రజలు సమస్యలు తెలుసుకునేందుకు పర్యటించినప్పుడు వార్డు సభ్యులు, కాలనీ వాసులు రోడ్డు నిర్మించాలని వినతిపత్రం ఇచ్చారని గుర్తు చేశారు. ప్రజలకు మేలు చేసేందుకు రోడ్డు నిర్మిస్తున్నాం తప్ప ఇందులో ఎటువంటి స్వార్థం లేదన్నారు. రోడ్డు నిర్మిస్తున్న సమయంలో జేసీబీ తగిలి ఆలయ ప్రహరీ కొద్దిగా పడిపోయింది తప్ప గోడ కూల్చి వేయలేదని స్పష్టం చేశారు. రాజకీయ దురుద్దేశంతోనే కొందరు తప్పుడు ఆరోపణలు చేస్తూ పత్రికల్లో రాయించడం భావ్యం కాదన్నారు. ఆలయం అభివృద్ధి చేయాలంటే పంచాయతీ పాలకవర్గంతో కలిసి రావాలి తప్ప వ్యతిరేకంగా మాట్లాడటం తగదన్నారు. 30 ఏళ్లయినా పాలక మండలి లేకుండానే దేవాలయం బాధ్యతలు చూశారని, అయినా ఎటువంటి అభివృద్ధి చేయలేదన్నారు. ధూపదీప నైవేద్యాలకు సంబంధించి ప్రభుత్వం అందించిన సాయాన్ని ఇక్కడి అర్చకుడికి కాకుండా వేరే అర్చకుడికి బదలాయించడంతో సర్పంచ్ ప్రశ్నించారని, అదే విధంగా ట్రస్ట్ పేరుతో కల్యాణ మండపం కడతామని ప్రతిపాదన తీసుకురాగా కాలనీవాసులు వ్యతిరేకించారని పేర్కొన్నారు. అందుకే కక్షతో ఇప్పుడు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని చెప్పారు. సమావేశంలో వార్డు మెంబర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

ఇంటింటా కుళాయి పనులు

వేగవంతం చేయాలి

- ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్



ఆర్‌బ్ల్యూఎస్ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

రణస్థలం: జల్ జీవన్ మిషన్ పథకం ద్వారా ఇంటింటికీ వేస్తున్న కుళాయి పనులు వేగవంతం చేయాలని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. మండలంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో తాగునీటి కల్పన పనులపై సోమవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎచ్చెర్ల నియోజకవర్గం వ్యాప్తంగా జల్ జీవన్ మిషన్ ద్వారా 369 గ్రామాల్లో ఇంటింటికీ కుళాయి పనులకు రూ.195 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. అందులో ఎన్ని టెండర్లు పూర్తి అయ్యాయి, ఇంకా ఎన్ని కావాల్సి ఉందని అధికారులను అడిగి తెలుసుకున్నారు. టెండర్లు అన్నీ అక్టోబర్ 31లోగా పూర్తికావాలన్నారు. పనులు శరవేగంగా చేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ సూర్యనారయణ మాట్లాడుతూ మొదటి విడతలో 55 గ్రామాల్లో పనులు పూర్తిచేయడం జరిగిందన్నారు. రెండవ విడతకు సంబంధించి 155 గ్రామాల్లో వివిధ స్థాయిలో ఉన్నాయని చెప్పారు. 351 పనులకు సంబంధించి 159 గ్రామాల్లో ఇంకా రూ.122 కోట్లు టెండర్ స్టేజ్‌లో ఉన్నాయని తెలిపారు. ఆర్‌డబ్ల్యూఎస్ జేఈలు రామారావు, దివ్య, భాగ్యలక్ష్మి, జెడ్పీటీసీ కాయల రమణ, వైఎస్సార్‌సీపీ మండల నాయకులు మీసాల వెంకటరమణ, చిల్ల వెంకటరెడ్డి, మూగి శ్రీరాములు, నక్కా ప్రసాద్, రాయపురెడ్డి భుజంగరావు, లుకలాపు శ్రీనివాసరావు, మైలపల్లి కామరాజు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ



పవన్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

శ్రీకాకుళం రూరల్: శ్రీసాయి కమ్యూనికేషన్ అధినేత, అరసవల్లి ఆలయ ట్రస్ట్‌బోర్డు మెంబర్ నెమలిపూరి కోటేశ్వరరావు చౌదరి ద్వితీయ కుమారుడు పవన్ శ్రీనివాస్ ఈ నెల 17న విశాఖలోని ప్రైవేటు ఆస్పత్రిలో ఆకస్మికంగా మృతిచెందారు. ఈ నేపథ్యంలో చౌదరి కుటుంబ సభ్యులను మంత్రి ధర్మాన ప్రసాదరావు సోమవారం పరామర్శించారు. చౌదరి కుమారులు ఇంటర్నెట్ టీవీ రంగంలో స్వయం కృషితో, విశేష అనుభవంతో జిల్లా వ్యాప్తంగా గౌరవం పొందారని తెలిపారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ గొండు కృష్ణమూర్తి, నర్సింహమూర్తి, డాక్టర్ గిరిబాబు పాల్గొన్నారు.

గార: అంపోలు గ్రామానికి చెందిన గొద్దు బోడెమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందడంతో ఆమె కుటుంబ సభ్యులను మంత్రి ధర్మాన ప్రసాదరావు పరామర్శించారు. ప్రభుత్వ పరంగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో గార ఎంపీపీ గొండు రఘురామ్, అంపోలు సర్పంచ్ గొండు జయరాం, ఎంపీటీసీ పి.వి.రామజోగి తదితరులు పాల్గొన్నారు.

మాజీ సైనిక ఉద్యోగుల సంక్షేమ సంఘం ఏర్పాటు

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండలంలోని ఫరీదుపేట గ్రామంలో మాజీ సైనిక ఉద్యోగుల సంఘాన్ని సోమవారం ఏర్పాటు చేశారు. గౌరవ అధ్యక్షుడిగా పైడి నాగేశ్వరరావు, అధ్యక్షుడిగా సీపాన అప్పారావు, ఉపాధ్యక్షుడిగా సువ్వారి రంగనాథం, ప్రధాన కార్యదర్శిగా పైడి నారాయణమూర్తి, కార్యదర్శిగా పైడి వెంకటనారాయణ, కోశాధికారిగా పైడి రంగనాథంను ఎన్నుకున్నారు. గ్రామంలో సామాజిక భవనం నిర్మాణం, గ్రామ సేవకు తమవంతు కృషి చేస్తామని నిర్ణయించారు.

నేడు బైరివానిపేటలో గడపగడపకు మన ప్రభుత్వం

శ్రీకాకుళం రూరల్: నగర పరిధిలో బైరివానిపేట, సీపాన్నాయుడుపేట గ్రామాల్లో మంగళవారం ఉదయం 7 గంటలకు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు శ్రీకాకుళం నగర కమిషనర్ చల్లా ఓబులేషు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంత్రి ధర్మాన ప్రసాదరావు నేతృత్వంలో జరిగే ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

నవనంపాడులో విజయభేరి

శ్రీకాకుళం రూరల్: మండలంలోని పొన్నాం పంచాయతీ నవనంపాడు గ్రామంలో సోమవారం జనసేన విజయభేరి సభ నిర్వహించారు. కార్యక్రమంలో జనసేన శ్రీకాకుళం నియోజకవర్గ ఇన్‌చార్జ్ కోరాడ సర్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రేపు సంతబొమ్మాళిలో 12వ వార్డు పోలింగ్

అరసవల్లి: స్థానిక ఉప ఎన్నికల్లో భాగంగా అనివార్య కారణాలతో వాయిదా పడిన సంతబొమ్మాళి గ్రామ పంచాయతీ 12వ వార్డుకు బుధవారం పోలింగ్ జరుగుతుందని జిల్లా అదనపు ఎన్నికల అధికారి వి.రవికుమార్ తెలిపారు. ఎన్నికల నిబంధనల మేరకు ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పోలింగ్ జరుగుతుందని పేర్కొన్నారు.

సులభంగా చెత్త తరలింపు



హైడ్రాలిక్ వాహనాన్ని పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ గిరిబాబు, కమిషనర్ నాగేంద్రకుమార్

కాశీబుగ్గ : మున్సిపాలిటీ పరిధిలోని 31 వార్డుల్లో చెత్త సేకరణ కోసం నూతన హైడ్రాలిక్ వాహనం వచ్చిందని మున్సిపల్ చైర్మన్ బళ్ల గిరిబాబు అన్నారు. సోమవారం మున్సిపల్ కార్యాలయానికి వచ్చిన నూతన వాహనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ నిధులు రూ.47 లక్షలతో ఈ వాహనం సమకూరిందన్నారు. చెత్త తరలింపు ఇక సులభతరమవుతుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ టి.నాగేంద్రకుమార్, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మి, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో లాభం



అట్టలు ప్రదర్శిస్తున్న పకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు

రణస్థలం: ప్రకృతి వ్యవసాయ పద్ధతుల అవలంభిస్తే ఎంతో లాభదాయకమని రీజనల్ ప్రకృతి వ్యవసాయ అధికారి జి.హేమసుందర్ తెలిపారు. మండలంలోని రణస్థలం గ్రామంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతులో పండించే పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గట్లపై కంది, బంతి, కూరగాయలు, పక్షి స్థావరాలు, పసుపు తెలుపు పల్లాలు, లింగాకర్షణ బుట్టలు, సాధారణ వరిలో కాలి బాటలు పరిశీలించారు. రైతుల సమక్షంలో అజొల్లా వేయించారు. అజొల్లా మదర్ ఫీట్ ఏర్పాటు చేశారు. అజొల్లా వేయడం వల్ల కలుపు నివారణ, నత్రజని లభ్యత పెరుగుతుందన్నారు. మాస్టర్ ట్రైనర్ కంబపు కృష్ణ, రణస్థలం డివిజన్ ప్రకృతి వ్యసాయ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం



లావేరు: వెంకటాపురంలో సీసీ రోడ్డు, కాలువలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

- ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్



జి.సిగడాం: రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

లావేరు: సీఎం జగన్‌మోహనరెడ్డి మాటకు కట్టుబడే వ్యక్తి అని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. మండలంలోని వెంకటాపురం గ్రామంలో ఉపాధి హామీ పథకం నిధులు రూ.75 లక్షలతో సీసీ రోడ్డులు, కాలువలు నిర్మించారు. వీటిని ఎమ్మెల్యే సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అన్నింటినీ సీఎం జగన్ అమలు చేశారన్నారు. పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. ఎమ్మెల్యేను వెంకటాపురం సర్పంచ్ బొంతు అరుణఎల్లంనాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ డీఈ సీతంనాయుడు, ఎంపీడీఓ సురేష్‌కుమార్, ఏఈ అప్పన్న, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి కంది నాని, మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు రొక్కం బాలకృష్ణ, జెడ్పీటీసీ మీసాల సీతన్నాయుడు, పార్టీ మండల కమిటీ అధ్యక్షుడు దన్నాన రాజినాయుడు, పీఏసీఎస్ అధ్యక్షుడు భూరాడ చిన్నారావు, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు షేక్‌చాన్‌భాషా, వైస్ ఎంపీపీ లుకలాపు శ్రీనివాసరావు, జేసీఎస్ మండల ఇన్‌చార్జి మీసాల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రహదారులకు మహర్దశ..

జి.సిగడాం: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో రదాహరులను అభివృద్ధి చేస్తున్నామని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. మండలంలోని పాలకొండ–విజయనగరం ప్రధాన రహదారిలో రాతుపేట, కొప్పలపేట గ్రామాల్లో బీటీ రోడ్డు నిర్మాణం పనులకు సోమవారం శంకుస్థాపన చేశారు. పెంట గ్రామం నుంచి పొగిరి, దేవరవలస నుంచి జీడిపాలెం, జగన్నాథవలస నుంచి కోయ్యానపేట వరకు రహదారుల నిర్మాణం కోసం ప్రభుత్వానికి నివేదిక పంపామన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా సచివాలయానికి రూ. 20 లక్షలను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. ఇప్పటికే విజయనగరం జిల్లా దీపురుపల్లి మండలం నిమ్మలవలస–జి.సిగడాం మండలం పెనసాం గ్రామాల మధ్యలో ఉన్న నిమ్మలవలస గెడ్డపై వంతెన నిర్మాణం పూర్తి చేసి ప్రజలకు మెరుగైన సౌకర్యం కల్పించామన్నారు. అభివృద్ధి పనుల సమయంలో ప్రజలు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చందక శారద, మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు మీసాల వెంకటరమణ, జెడ్పీటీసీ కాయల రమణ, వైఎస్సార్‌సీపీ మండల కమిటీ అధ్యక్షుడు బూరాడ వెంకటరమణ, రాష్ట్ర బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ మామిడి జయకుమారి, వైస్ ఎంపీపీలు మీసాల రాంబాబు, తోలేటి వెంకటరావు, డీసీఎంఎస్ డైరెక్టర్ నక్క ప్రసాదరావు, ఎంపీటీసీ పెద్ది శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నేతలకు వ్యతిరేకంగా ధర్నా



పట్టాలు ఇచ్చిన భూమిలో ధర్నాకు దిగిన గ్రామస్తులు

శ్రీకాకుళం రూరల్: ప్రభుత్వ భూమిలో తమకు పట్టాలు ఇస్తే, టీడీపీ నేతలు అడ్డగోలుగా గ్రీవెన్స్‌లు ఫిర్యాదులు చేస్తున్నారని, దీనిపై జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించి పేదలకు న్యాయం చేయాలని చాపురం గ్రామస్తులు డిమాండ్ చేశారు. టీడీపీ నేతలకు వ్యతిరేకంగా చాపురం, సిద్ధిపేట కార్పొరేషన్లకు చెందిన గ్రామస్తులు సోమవారం ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా పార్టీ సీనియర్ నాయకులు అల్లు లక్ష్మీనారాయణ మాట్లాడుతూ మంత్రి ధర్మాన ప్రసాదరావు ఆదేశాల మేరకు ప్రభుత్వ భూమిలో పేదలకు పట్టాలు అందించారని గుర్తు చేసారు. 2014 టీడీపీ ప్రభుత్వ హయాంలో టీడీపీ వర్గీయుల్లో 100 మందికి అదే స్థలంలో అప్పుడు పట్టాలు ఇచ్చారని, ప్రస్తుతం మిగిలిన ప్రభుత్వ భూమిలో 30 మందికి ఇళ్ల పట్టాలు అందిస్తే టీడీపీ నేతలు భయభ్రాంతులకు గురిచేయడం తగదన్నారు. ఈ విషయమై జాయింట్ కలెక్టర్‌కు తప్పుడు సంకేతాలు అందిస్తూ, ప్రతిసారి గ్రామానికి చెందిన టీడీపీ నేతలంతా స్పందన గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేయడం తగదన్నారు. కార్యక్రమంలో వడ్డి గౌతమి, కె.లక్ష్మీ, అల్లు మల్లేసు, కింజరాపు లక్ష్మీనారాయణ, అప్పలసూరి తదితరులు పాల్గొన్నారు.

కె.మత్స్యలేశంలో వైద్య శిబిరం



వైద్యశిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం అర్బన్: భారతీయ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో జెమ్స్ ఆసుపత్రి సౌజన్యంతో కళింగపట్నంలోని కె.మత్స్యలేశం ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలో సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన బీహెచ్‌ఆర్‌సీ నేషనల్ చైర్మన్ డాక్టర్ పూర్ణచంద్ర సాహు, నేషనల్ వైస్ చైర్మన్ డాక్టర్ పుల్లెల నాగేశ్వరరావులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

అనంతరం 150 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో బీహెచ్‌ఆర్‌సీ ఏపీ స్టేట్ ఇన్‌చార్జి ఆర్.చండీశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు టి.పేతురు, జిల్లా ఉమెన్‌సెల్ అధ్యక్షురాలు ఎ.సుధ, శ్రీకాకుళం మండల అధ్యక్షుడు ఎం.సంతోష్‌పూర్ణ, సభ్యులు పాల్గొన్నారు.

మెడికల్ సెంటర్‌కు రూ.లక్ష విరాళం



సోంపేట రోటరీ అధ్యక్షుడికి చెక్ అందజేస్తున్న రోటరీ గవర్నర్

సోంపేట: సోంపేట రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో నిర్మాణం చేపడుతున్న రోటరీ ఉద్యానం మెడికల్ సెంటర్‌కు రోటరీ ఎలెక్ట్ గవర్నర్ ఎం.వెంకటేశ్వర్లు లక్ష రూపాయల విరాళాన్ని సోంపేట రోటరీ అధ్యక్షుడు దుద్ది శ్రీనివాసరావుకు సోమవారం అందజేశారు. ఈ సందర్భం రోటరీ గవర్నర్ మాట్లాడుతూ సోంపేట రోటరీ క్లబ్ ద్వారా అందిస్తున్న సేవలు ఆదర్శనీయమన్నారు. కార్యక్రమంలో రోటరీ కార్యదర్శి పి.వి.కృష్ణారావు, సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.